రెచ్చిపోతున్న ఆకతాయిలు



తాగి పడేసిన మందు సీసాలు, గ్లాసులు



ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద అన్న క్యాంటీన్ ఎదురుగా ఉన్న స్థలంలో కాల్చి పడేసిన సిగరెట్లు

- శివనగర్ రహదారి అడ్డాగా అసాంఘిక కార్యకలాపాలు
- రాత్రిళ్లు కంటైనర్లు, షాపుల వెనుక మందుబాబుల మకాం
- విచ్చలవిడిగా గంజాయి, ధూమ, మద్యపానాలు
- స్థానికులు, వాహన చోదకుల ఆందోళన
- కన్నెత్తి చూడని పోలీసులు

మర్రిపాలెం: జీవీఎంసీ 58వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ నుంచి శివనగర్‌కు వెళ్లే రహదారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఆర్ అండ్ బీ భవన సముదాయాలనే ఆవాసాలుగా చేసుకుని ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. విచ్చలవిడిగా గంజాయి, ధూమ, మద్యపానాలు చేస్తూ స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్నారు. అదే దారి సమీపంలో అన్న క్యాంటీన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నా.. పోలీసులు అటువైపు కన్నెత్తి చూడక పోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు.

నిరుపయోగంగా ఆర్ అండ్ బీ సముదాయాలు

ఇక్కడ కొంత కాలంగా నిరుపయోగంగా ఉన్న ఆర్ అండ్ బీ భవన సముదాయాలను అడ్డాగా చేసుకుని కొందరు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అన్న క్యాంటీన్ ఎదురుగా ఉన్న ఆర్ అండ్ బీ కార్యాలయంలో గతంలో వాహనాలకు నంబర్ ప్లేట్లు బిగించేవారు. కొత్తగా వాహనాలు కొనేవారు తమ వాహనాలకు నంబర్ ఖరారైన తర్వాత ఈ కార్యాలయం వద్దకు వాహనాన్ని తీసుకొస్తే నంబర్ ప్లేట్ వేసేవారు. చాలా కాలంగా ఈ కార్యాలయం ఎందుకూ పనికిరాకుండా మూత పడి ఉంది. కార్యాలయం తలుపులకు తాళాలు వేసినా, పైన ఉన్న చిన్న గేటు ఎప్పుడూ తెరిచే ఉంటుంది. దీంతో ఇదే అదునుగా మందుబాబులు రాత్రి వేళల్లో ఇక్కడికి వచ్చి ఫూటుగా తాగి అక్కడే సీసాలు, గ్లాసులు పడేసి వెళ్లిపోతున్నారు.

రాత్రయితే చిందులే..

శివనగర్ రోడ్డులో శిథిలమైన సముదాయాలు, కొంత కాలంగా ఉన్న ఒక కంటైనర్ వెనుక, లారీలు, షాపుల వెనుక కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రాత్రయితే చాలు అక్కడ చేరి గంజాయి, మద్యం తాగుతుండటంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయొద్దని, అలా చేస్తే జరిమానాలు, శిక్షలు విధిస్తామని, ఇది చట్టవిరుద్ధమని, ఆరోగ్యానికి హానికరమని ఓ పక్క ప్రచారాలు చేస్తున్నప్పటికీ.. ఈ ప్రాంతంలో ఆకతాయిలు విచ్చలవిడిగా సిగరెట్లు కాల్చి పడేస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న భవనం పక్కన ఖాళీ ప్రదేశంలో వందల కొద్ది సిగరెట్లు కాల్చి పడేయడం వల్ల పరిసర ప్రాంతాలు చెత్తమయంగా మారుతున్నాయి. ఇక్కడ ఎటుచూసినా సిగరెట్లు, మందు సీసాలు, గ్లాసులు పడేస్తున్నారని చుట్టుపక్కల నివాసులు చెబుతున్నారు.

విజిబుల్ పోలీసింగ్ ఎక్కడ..?

శివనగర్ రహదారిలో రాత్రిళ్లు ప్రయాణించాలంటేనే భయమేస్తోందని స్థానికులు, వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఆరోగ్య కేంద్రం మొదలుకుని ఓ పక్క ఆస్పత్రి ఉంటే.. మరోపక్క శ్మశానవాటికతో వణుకుతుంటే.. వీటికి తోడు మందుబాబుల ఆగడాలు ఎక్కువైపోతున్నాయంటున్నారు. రాత్రి 9 దాటిందంటే ఈ రోడ్డులో వెళ్లేందుకు భయపడుతున్నామని, మహిళలు, చిన్నపిల్లలు, అటుగా వెళ్లాలన్నా, ఒంటరిగా పంపించాలన్నా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికే నగర పోలీస్ కమిషనర్ సమస్యాత్మక ప్రాంతాల్లో నిత్యం గస్తీ ఉండి, ప్రత్యేక డ్రైవ్‌లు పెట్టి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి ప్రత్యేక దృష్టి సారించాలని సూచనలు చేస్తున్నప్పటికీ స్థానిక పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో పోలీసులు నిఘా పెట్టి ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.



అంధకారంలో యూపీహెచ్‌సీ నుంచి ఆర్ అండ్ బీ హైవేకు వెళ్లే శివనగర్ రోడ్డు



నిరుపయోగంగా ఆర్ అండ్ బీ కార్యాలయం (గతంలో ఇక్కడ వాహనాలకు నంబర్ ప్లేట్లు వేసేవారు)



శివనగర్ రోడ్డులో రాత్రి వేళ మందుబాబులు తిష్ట వేస్తున్న ప్రదేశం



ఆకతాయిలకు అడ్డాగా మారిన శిథిలమైన ఆర్ అండ్ బీ భవన సముదాయం

అర్ధనారీశ్వరుడిగా దుర్గాగణపతి



అర్ధనారీశ్వర అలంకరణలో దుర్గాగణపతి

సీతంపేట: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి ఆఖరి రోజు గురువారం అర్ధనారీశ్వర గణపతి అలంకరణలో దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాల భక్తులు స్వామిని దర్శించి పూజలు చేశారు. ఉదయం ఆలయంలో మహా గణపతి హోమం, మహా అభిషేకం, సహస్ర నామార్చన, అలంకరణ జరిపారు. సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది. ఆలయ ఈవో జి.వి.రమాభాయి, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు పల్లకీ ఊరేగింపు..

నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా దుర్గాగణపతి ఉత్సవ మూర్తుల ఊరేగింపు మహోత్సవం శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందని ఈవో రమాభాయి తెలిపారు. మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సిద్ధి, బుద్ధి సమేత దుర్గాగణపతి ఉత్సవ మూర్తుల ఊరేగింపు సీతంపేట పురవీధుల్లో అంగరంగ వైభవంగా జరగుతుందని, భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

విజయ గణపతికి విశేష పూజలు



మురళీనగర్: స్థానిక బాలభాను విద్యాలయంలో కొలువైన విజయ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మహా అన్నదానం నిర్వహించారు. ముందుగా స్వామికి విశేష పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం 500 మంది విద్యార్థులు కాలనీవాసులకు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి.ఆర్.కె.రాజు, విద్యాలయం డైరెక్టర్ వి.పార్వతి, రిటైర్డ్ టీచర్ ఎస్.శ్యామల, ప్రిన్సిపాల్ శుభశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ మనోరమణి, పీడీ సిహెచ్.రమణారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధ్యాన మందిరంలో వైద్య శిబిరం



మందిరంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న మెడికవర్ హాస్పిటల్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 120 మంది భక్తులకు బీపీ, డయాబెటిక్ వంటి ఆరోగ్య పరీక్షలతో నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. ప్రస్తుతం తీసుకుంటున్న జంక్ ఫుడ్స్ వంటి ఆహార పదార్థాల వల్ల ఆరోగ్యాలు పాడవుతున్నాయని అవగాహన కల్పించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ మానస, సిబ్బంది అభిరామ్, ధ్యాన మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు



బేత శంకరరావు

మర్రిపాలెం: తన భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంత వరకు రాలేదని కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు అతడి భార్య ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సత్యానగర్ శివాలయం వీధిలో కుటుంబంతో కలిసి నివసిస్తున్న బేత శంకరరావు ఈ నెల 3న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇంతవరకు చేరుకోలేదు. అంతటా వెతికినా అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో అతడి భార్య రాణి ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. సీఐ రవికుమార్ నేతృత్వంలో ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ సాధన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శంకరరావు ఆచూకీ తెలిసిన వారు సమాచారమివ్వాలని కంచరపాలెం పోలీసులు కోరారు.

రైల్వేస్టేషన్‌లో 8.6 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 8.6 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.రామారావు, సీబీఐ విశాఖపట్నం ఏఎస్ఐ జె.తమ్మునాయుడు తమ సిబ్బందితో కలిసి గురువారం విశాఖ రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. కేరళ రాష్ట్రం అలెప్పి జిల్లాకు చెందిన ఆశిత్, మొహ్మద్ అల్తాఫ్‌లు విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తుండడాన్ని గుర్తించారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.43 వేల విలువైన 8.6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులను ఎస్ఐ రామారావుకు అప్పగించారు. రిమాండ్ నిమిత్తం నిందితులను కోర్టులో హాజరు పరిచారు.

కార్పొరేటర్ పూర్ణిమ దాతృత్వం



బాధితుడికి నగదు అందజేస్తున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ

కంచరపాలెం: అనారోగ్యంతో మంచాన పడ్డ నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తికి వైద్య సహాయం అందించి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ దాతృత్వం చాటుకున్నారు. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం బాబూ కాలనీలో నివసిస్తున్న టెంక వెంకటరమణ కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకున్న కార్పొరేటర్ పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్‌లు గురువారం బాధితుడి వైద్య ఖర్చులకు రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ ద్వారా పేదోడికి ఉచిత వైద్యం అందేదన్నారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని పూర్తిగా విస్మరించడంతో పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వార్డులో బాధితులను గుర్తించి తమకు సమాచారం అందించడం అభినందనీయమన్నారు. బాధితులు నేరుగా తమను ఆశ్రయిస్తే ఆర్థికంగా ఆదుకునే విషయంలో ముందుంటామని ఆమె తెలిపారు.

రోడ్డెక్కిన మురుగుతో అవస్థలు



రోడ్డుపై నిలిచిపోయిన మురుగు నీరు



అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డుపై మురుగు నీరు ప్రవహించడంతో వాహన చోదకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ రోడ్డులో డ్రెయిన్‌పై కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. దీని కోసం డ్రెయిన్‌లోని మురుగు నీటిని పైపు ద్వారా రోడ్డుపైకి మళ్లించారు. దీంతో మురుగు నీరు ఏరులా రోడ్డుపై ప్రవహించడంతో ఉదయాన్నే స్కూల్‌కు వెళ్లే విద్యార్థుల బూట్లు, ఫ్యాంట్లు తడిసిపోయి కంపు కొట్టడంతో ఇబ్బందులకు గురయ్యారు. వాహన చోదకులు మురుగు నీటి ప్రవాహంలో ప్రయాణించాల్సి రావడంతో దుస్తులపైకి తుళ్లడంతో ఇదేనా పని తీరని అసహనం వ్యక్తం చేశారు. డ్రెయిన్‌లోని మురుగు నీరు పైపు ద్వారా సమీప డ్రెయిన్‌లోకి మళ్లించకుండా పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా రోడ్డుపైకి విడిచిపెట్టడంతో జనం అవస్థల పాలయ్యారు. పనులు పర్యవేక్షించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు ఏమి చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులు నిర్వహించేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని స్థానికులు కోరుతున్నారు.

ఓటర్ల జాబితాపై సమీక్ష



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆర్వో జ్ఞానవేణి, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు

తాటిచెట్లపాలెం: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలా నిర్వహించే ఓటర్ల జాబితా సమీక్ష సమావేశం గురువారం సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి ఆధ్వర్యంలో జరిగింది. ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ ఆఫీసర్లు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల మార్పులు చేయాల్సి ఉందని, సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ వద్ద కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ రహదారి దాటాల్సి వస్తున్న ఓటర్ల సమస్యలను ప్రస్తావిస్తూ, వారికి సౌకర్యవంతమైన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

ఆవిష్కరణల దిశగా పనిచేయాలి

మద్దిలపాలెం: విద్యార్థులు ఆవిష్కరణల దిశగా పని చేయాలని భట్నాగర్ అవార్డు గ్రహీత, ఐఐటీ హైదరాబాద్ పూర్వ సంచాలకుడు జి.నరహరి శాస్త్రి సూచించారు. ఏయూ కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు ఎండోమెంట్ లెక్చర్‌లో భాగంగా గురువారం ఆయన ప్రసంగించారు. నేటి సమాజంలో రసాయన శాస్త్రం, బయాలజీ, ఏఐ టెక్నాలజీలను మిళితం చేస్తూ జరుగుతున్న పరిశోధనలను వివరించారు. 2024 సంవత్సరానికి నోబెల్ బహుమతిని రసాయన శాస్త్రవేత్త, టెక్నాలజిస్టుకు సంయుక్తగా అందించిన విధానం, వారు చేసిన పరిశోధనలను విద్యార్థులకు వివరించారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ నూతన జ్ఞానాన్ని అందిస్తూ, విస్తృత అవగాహన కల్పించే ఇటువంటి కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యం పూర్తిస్థాయిలో ఉండాలన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో 63 పరీక్షలూ చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తప్పనిసరిగా ప్రభుత్వం నిర్దేశించిన 63 టెస్టులు జరగాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. తన కార్యాలయ సమావేశ మందిరంలో మలేరియా అధికారులు, అసిస్టెంట్ మలేరియా అధికారులు, సబ్ యూనిట్ అధికారులు, సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లతో గురువారం ఆయన సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఐవీఆర్ఎస్ ప్రకారం మన జిల్లా వైద్య పరీక్షల్లో వెనుకబడి ఉందన్నారు. అన్ని టెస్టులకు అవసరమైన కెమికల్స్ సరఫరా చేయాలని జిల్లా మలేరియా అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ సిహెచ్.సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా అన్నదానాలు



శాంతిపురంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ గోవింద్, కమిటీ సభ్యులు



104 ఏరియాలో అన్నప్రసాదం వడ్డిస్తున్న మహేష్‌రెడ్డి, గుజ్జు వెంకటరెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి

సీతంపేట: స్థానిక శాంతిపురంలోని సాయి గణపతి ఆలయంలో నిర్వహిస్తున్న నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం మోకర వెంకటరావు ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథి 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ముందుగా గణపతికి విశేష పూజలు నిర్వహించారు. లావణ్య, అలివేలు, పరమేశ్వరరావు, సత్యనారాయణ, ముద్దాడ శంకర్, ముద్దాడ ఎల్లాజి, జోగ శ్రీను, మన్మధరావు, బీసపు శ్రీను, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

5 వేల మందికి అన్నప్రసాదం

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియా మర్రిపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, రాష్ట్ర అటవీ శాఖ మాజీ డైరెక్టర్ గుజ్జు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వేమన యూత్ అసోసియేషన్ 25 వసంతాల సందర్భంగా నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులు వేమన సంఘం అధ్యక్షుడు జి.మహేష్‌రెడ్డి, మాజీ చైర్మన్ సత్తి రామకృష్ణారెడ్డి మండపంలో గణేషుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 25 రకాల వంటకాలతో సుమారు 5 వేల మంది భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, ఎంఈఎస్ బిల్డింగ్స్ అసోసియేషన్ ఆలిండియా వైస్ ప్రెసిడెంట్ బాల సతీష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు దివాకర్, అసోసియేషన్ సభ్యులు గుజ్జు ధీరజ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు, శంకరరెడ్డి, రాజారెడ్డి, రమేష్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పోతన్న, మహిళలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సత్కారం



లక్ష్మీవరప్రసాద్‌ను శాలువాతో సత్కరిస్తున్న ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రమీల

మురళీనగర్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం విశ్రాంత ఉపాధ్యాయుడు కుప్పిలి లక్ష్మీవరప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. బిర్లా కూడలిలోని ఆయన స్వగృహానికి వెళ్లి ఓం వాకర్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల ఆధ్వర్యంలో శాలువాతో సత్కారం చేశారు. లక్ష్మీవరప్రసాద్ గణిత, ఆంగ్ల ఉపాధ్యాయుడిగా, గెజిటెడ్ హెచ్‌ఎంగా పనిచేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్-101 గవర్నర్ కె.ద్వారకానాథ్, పూర్వ గవర్నర్ యు.శుభ, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఓనం వేడుకలు



ఓనం వేడుకల్లో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఓనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రిథమ్ క్లబ్ విద్యార్థుల నృత్య ప్రదర్శన అలరించింది. విద్యార్థులకు నిర్వహించిన ఓనం రంగవల్లికల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ పోటీలకు సిస్టర్ మార్గరెట్, సిస్టర్ అనసీ, డాక్టర్ నళినీదత్త న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీకి నాగశిరోమణి పార్థివదేహం అప్పగింత



నాగశిరోమణి పార్థివ దేహాన్ని ఏఎంసీకి అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

మహారాణిపేట: మురళీనగర్‌కు చెందిన వల్లభనేని నాగ శిరోమణి(76) గురువారం మృతి చెందారు. ఈమె భర్త వల్లభనేని వీర రాఘవయ్య(లేట్) కూడా శరీరదాతల సంఘంలో సభ్యుడిగా ఉన్నారు. ఈ దంపతులు సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గతంలోనే శరీరదాన పత్రాలు రాసి ఇచ్చారు. గురువారం నాలుగు గంటలకు విశాఖ జిల్లా శరీర దాతల సంఘం జిల్లా కార్యదర్శి వై.నూకరాజు ఆధ్వర్యంలో నాగ శిరోమణి పార్థివ దేహాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజీ అనాటమీ డిపార్ట్‌మెంట్‌కు అందజేశారు. శరీర దాత నాగ శిరోమణికి సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ తరపున చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగ శిరోమణి కుమారుడు వెంకట రాజశేఖర్, కుమార్తె అనురాధ, బంధుమిత్రులు పాల్గొన్నారు.